భయపెడుతున్న భారీ వాహనాలు

- ఇరుకురోడ్లపై యథేచ్ఛగా రాకపోకలు
- మడికొండలో నిత్యం రోడ్డు ప్రమాదాలు
- పట్టించుకోని అధికారులు, పాలకులు

మడికొండ: మడికొండ – ధర్మసాగర్ రహదారిపై రోజూ పదుల సంఖ్యలో భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ఈ రోడ్డు ఇరుకుగా ఉండడంతో నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. దాంతో ఈ మార్గంలో పయనించడానికి వాహనదారులు, ప్రయాణికులు జంకుతున్నారు. ప్రమాదం జరినప్పుడే భారీ వాహనాలకు అనుమతిని స్థానిక పోలీసులు నిరాకరిస్తూ, ఆ తర్వాత పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత సంవత్సరం ఫిబ్రవరిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందాడు. ధర్మసాగర్ – మడికొండ శివారులోని పెద్దమ్మ ఆలయం వద్ద లారీ ఢీకొట్టడంతో కాజీపేట విష్ణుపురికి చెందిన అఖిల్ అక్కడిక్కడే దుర్మరణం చెందాడు. ఇటీవల ఓ సిమెంట్ షాపునకు చెందిన లారీ.. మడికొండ చౌరస్తా నుంచి గ్రామంలోకి వెళ్తుండగా, ధర్మసాగర్ నుంచి మడికొండ చౌరస్తా వైపునకు వెళ్తున్న మరో భారీ వాహనం ఇరుకు రోడ్డుపై ఇరుక్కుపోయాయి. దాంతో ప్రయాణికులు, వాహనదారులు గంటల తరబడి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మూలమలుపు వద్ద రోడ్డు ప్రమాదాలు నిత్య కృత్యంగా మారాయి. గురువారం బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని టిప్పర్ ఢీకొట్టగా, అతని కాలు విరిగింది.


మడికొండలో ఇరుక్కుపోయిన లారీ (ఫైల్)


రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన అఖిల్ (ఫైల్)

భారీ వాహనాలు రాకుండా చూడాలి



మడికొండ గ్రామంలోకి భారీ వాహనాలు వస్తుండడంతో నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డు ఇరుకుగా ఉండడంతో వాహనదారులు, ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడంలేదు. ఏదైనా రోడ్డు ప్రమాదం జరిగినప్పుడే పోలీసులు హడావుడి చేసి లారీలను ఆపి, ఆ తర్వాత పట్టించుకోవడం లేదు.

– పానగోటి వెంకట్‌రావు, స్థానికుడు

గ్రామంలోకి భారీ వాహనాలు రావొద్దని గతంతో పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్ల పరిస్థితి మూడు రోజుల ముచ్చటగానే మిగిలిపోయింది. బారికేడ్లను ఓ లారీ ఢీకొట్టడంతో అవి కూలిపోయాయి. ఆ తర్వాత పోలీసులు కూడా పట్టించుకోలేదు. దాంతో లారీలు, టిప్పర్లు రాకపోకలు సాగిస్తున్నాయి.

ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు



మడికొండ: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన మడికొండలో గురువారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ధర్మసాగర్ మండల కేంద్రానికి చెందిన కొంరయ్య.. మడికొండలోని ఓ వివాహ వేడుకకు హాజరయ్యేందుకు బైక్‌పై వస్తుండగా మూలమలుపు వద్దకు చేరుకోగానే, టిప్పర్‌లారీ అతన్ని ఢీకొట్టింది. దాంతో కొంరయ్య కాలు విరగగా, అంబులెన్స్‌లో ఎంజీఎం ఆస్పత్రికి స్థానికులు తరలించారు.

బెనిఫిట్స్ చెల్లించాలని కార్మికుల ధర్నా

హన్మకొండ చౌరస్తా: హనుమకొండలోని శ్రీరస్తు, కళ్యాణలక్ష్మి షాపింగ్‌మాళ్లలో పనిచేసిన కార్మికులు గురువారం ఆయా షాపింగ్‌మాళ్ల ఎదుట ధర్నా చేశారు. దాదాపు 38 ఏళ్లపాటు ఆయా షాపింగ్ మాళ్లలో పనిచేశామని, తమకు కార్మిక చట్టపరంగా రావాల్సిన సర్వీసు, బోనస్, బకాయి పీఎఫ్, ఇతర లావాదేవీలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు వేల్పుల సారంగపాణి మాట్లాడుతూ ఆయా షాపింగ్‌మాల్ యాజమాన్యాలు కార్మికులకు ముందస్తు నోటీసులు ఇవ్వకుండా 2024, అక్టోబర్‌లో దుకాణాలు మూసివేశాయని అన్నారు. కాగా, సమాచారం అందుకున్న హనుమకొండ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని బందోబస్తు నిర్వహించారు. వెంకటేశ్వర్లు, వెంకట్ నారాయణ, నాగరాజు, జయ, రాధిక, రమాదేవి, లావణ్య, ఎజాస్, సందీప్, మహేష్, నవీన్, అమీద్, రాజేష్‌ఖన్నా, సురేష్, ప్రవీణ్, రమేష్, మహేందర్, యాదగిరి, సదానందం తదితరులు పాల్గొన్నారు.


మూసివేసిన కళ్యాణలక్ష్మి షాపింగ్‌మాల్ ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు, నాయకులు

వేతనాల కోసం హాస్టల్ వర్కర్ల ఆందోళన


నిరసన తెలుపుతున్న కార్మికులు, నాయకులు

హన్మకొండ అర్బన్: 8 నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయాలని కాకతీయ వైద్య కళాశాల హాస్టళ్లలో పనిచేస్తున్న 86మంది కార్మికులు హనుమకొండ కలెక్టరేట్ కార్యాలయం ఎదుట గురువారం ఆందోళన నిర్వహించారు. తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కె.యాదానాయక్ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. కలెక్టర్ జోక్యం చేసుకుని పెండింగ్‌లో జీతాలు ఇప్పించాలంటూ నినాదాలు చేశారు. అనంతరం జిల్లా అధికారులకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు జీలపల్లి సుధాకర్, అల్లం రమేష్, డి.రాణి, అతీక్, శరత్, ప్రశాంత్, కోమల, రాజ కుమారి, బాబు, సుమన్, నరేష్, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: వరంగల్‌లోని పలు ప్రాంతాల్లో ఈనెల 6న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డీఈ ఎస్.మల్లికార్జున్ తెలిపారు. ఏఎస్.రెడ్డి నగర్, శివనగర్, పుప్పాలగుట్ట ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

సమగ్ర విచారణకు ఆదేశం

హసన్‌పర్తి: హసన్‌పర్తి పశు వైద్యశాలలో చోటు చేసుకుంటున్న అవినీతిపై సమగ్ర విచారణకు కలెక్టర్ ప్రావీణ్య ఆదేశించారు. 'వసూల్ రాజా' అనే శీర్షికన 'సాక్షి'లో బుధవారం ప్రచురితమైన కథనానికి కలెక్టర్ ప్రావీణ్య స్పందించారు. ఈమేరకు ప్రత్యేక అధికారిని విచారణ అధికారిగా నియమించారు. సమగ్ర విచారణ జరిపి నివేదిక అందించాలని ఆదేశించారు. కాగా, హసన్‌పర్తి పశువైద్యశాల ఆవరణలో శుక్రవారం విచారణ జరగనుంది.

సతీశ్‌కు తెలుగు వర్సిటీ ఎంఫిల్



హన్మకొండ కల్చరల్: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, జానపద గిరిజన విజ్ఞానపీఠం వరంగల్ ప్రాంగణం నుంచి ఎంఫిల్ పట్టాను వరంగల్ జిల్లా, ఐనవోలు మండలం, సింగారం గ్రామానికి చెందిన సోన బోయిన సతీశ్ అందుకున్నారు. వరంగల్ హంటర్‌రోడ్డులోని జానపద గిరిజన విజ్ఞానపీఠం నుంచి తెలుగు విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ భట్టు రమేష్ ఆధ్వర్యంలో 'ముదిరాజుల వృత్తి – జీవన విధానం' అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి ఆయనకు ఎంఫిల్ పట్టాను వర్సిటీ అందజేసింది.

చిన్నారి కృత్రిమ కాళ్లకు చేయూత



కాజీపేట అర్బన్: కాజీపేట మండలం భట్టుపల్లి గ్రామానికి చెందిన వల్లాల రత్నాకర్ కుమారుడు అశ్విత్‌కు కృత్రిమ కాళ్ల నిమిత్తం తెలంగాణ ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి గురువారం రూ.50 వేల ఆర్థిక సాయం అందజేశారు. తమ కుమారుడికి నడకను ప్రసాదించేందుకు చేయూతనందించిన జంగా రాఘవరెడ్డి, సుజాత దంపతులకు రుణపడి ఉంటామని అశ్విత్ తండ్రి రత్నాకర్ అన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ తొట్ల రాజుయాదవ్, నాయకులు పాల్గొన్నారు.

పరీక్ష ప్యాడ్ల పంపిణీ



హసన్‌పర్తి: ఒకటో డివిజన్ ముచ్చర్లలోని జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు స్థానిక ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు ఆదేశాల మేరకు పరీక్ష ప్యాడ్లు గురువారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గడ్డం వరుణ్‌కుమార్, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు నరేష్, నాయకులు కర్ణాకర్, భరత్, కార్తీక్, జగన్, రాము, హరీశ్, నవీన్, ఎలియా తదితరులు పాల్గొన్నారు.

జ్యూట్ బ్యాగుల అందజేత



కేయూ క్యాంపస్: జాతీయ జ్యూట్ దినోత్సవాన్ని పురస్కరించుకొని హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల తెలుగు విభాగం అధ్యాపకుడు డాక్టర్ చింతం ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో బోధనేతర సిబ్బందికి జ్యూట్ బ్యాగులను కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జ్యోతి గురువారం పంపిణీచేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ కరుణాకర్, సదాశివ్, ఫిరోజ్, సతీష్, నాగయ్య, తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కార్డు కలిగి ఉండాలి



హన్మకొండ చౌరస్తా: భవన, ఇతర నిర్మాణ రంగాల కార్మికులు తప్పనిసరిగా కార్మిక శాఖ గుర్తింపు కార్డు కలిగి ఉండాలని అసిస్టెంట్ లేబర్ కమిషనర్ నారాయణ స్వామి అన్నారు. హనుమకొండ కలెక్టరరేట్‌లోని కార్మికశాఖ కార్యాలయంలో పది, ఇంటర్, బీటెక్ చదువుతున్న ఎనిమిది మంది కార్మికుల పిల్లలకు ఉపకార వేతన చెక్కులను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికశాఖ గుర్తింపు కార్డు వలన ప్రభుత్వ సంక్షేమ పథకాలలో లబ్ధి పొందవచ్చని నారాయణస్వామి వివరించారు.

నిర్మాత దిల్‌రాజ్ సందడి

హన్మకొండ: నిర్మాత, తెలంగాణ ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్‌రాజ్ (వి.వెంకట రమణారెడ్డి) హనుమకొండలో గురువారం సందడి చేశారు. హనుమకొండ వికాస్‌నగర్‌లో కాంగ్రెస్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, వరద రాజేశ్వర్‌రావు దంపతుల బంధువుల అపార్ట్‌మెంట్ నిర్మాణ భూమిపూజ కార్యక్రమంలో దిల్‌రాజ్ పాల్గొని అభిమానులతో కలిసి సందడి చేశారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో బలపడిన బీసీ వాదం

- బీసీ జేఏసీ రాష్ట్ర చైర్మన్ తిరునహరి శేషు

హన్మకొండ: రాష్ట్రంలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీ వాదం బలపడ్డదని బీసీ జేఏసీ రాష్ట్ర చైర్మన్ తిరునహరి శేషు అన్నారు. హనుమకొండ సుబేదారిలోని బీసీ జేఏసీ ముఖ్య నాయకుల సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరీంనగర్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానంలో బీజేపీ బలపరిచిన బీసీ అభ్యర్థి విజయం సాధించగా, కరీంనగర్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానంలో ప్రధాన పార్టీలు కాంగ్రెస్, బీజేపీలకు దీటుగా బీఎస్పీ బలపరిచిన అభ్యర్థి ప్రసన్న హరికృష్ణకు 60 వేలకు పైగా మొదటి ప్రాధాన్యత ఓట్లు వచ్చాయని అన్నారు. నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానంలో బీసీ అభ్యర్థులు 6 వేల నుంచి 7 వేల ఓట్లు సాధించి ప్రధాన ఉపాధ్యాయ సంఘాలకు, పార్టీలకు బలమైన పోటీదారులుగా నిలిశారని వివరించారు. బీసీ వాదం ఏ వర్గానికో, కులానికో వ్యతిరేకం కాదని, దశాబ్దాల వెనుకబాటు తనానికి, వివక్షకు వ్యతిరేకంగా, ప్రభుత్వాల నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా చేస్తున్న పోరాటంగా చూడాలని కోరారు. సమావేశంలో దారబోయిన సతీష్, ఎర్రబొజ్జ రమేష్, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న తిరునహరి శేషు

'అకుట్' కార్యవర్గానికి సన్మానం

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ (అకుట్) అధ్యక్షుడిగా ఎన్నికైన ప్రొఫెసర్ వెంకట్రామ్‌రెడ్డి, జనరల్ సెక్రటరీ డాక్టర్ ఎల్‌పీ.రాజ్‌కుమార్‌ను యూనివర్సిటీలో వివిధ విద్యార్థి సంఘాల బాధ్యులు గురువారం సన్మానించారు. మంద వీరస్వామి, పాలకుల కొమురయ్య, వడ్డెపెల్లి మధు, కలకోట్ల సుమన్, ఆలువాల కార్తీక్, క్లోపెల్లి ప్రశాంత్, వెంకటేశ్వర్లు, బొట్ల మనోహర్, సూరాసి కృష్ణ, శంకర్, తిరుపతి పాల్గొన్నారు.

ఉత్సాహంగా 2కే వాకథాన్



హన్మకొండ అర్బన్: జాతీయ దంత వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని హనుమకొండ కలెక్టరేట్ కార్యాలయం వద్ద గురువారం చేపట్టిన 2కే వాకథాన్‌ను ఎంపీ కడియం కావ్య జెండా ఊపి ప్రారంభించారు. ఇండియన్ డెంటల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాకథాన్ పబ్లిక్ గార్డెన్ వరకు ఉత్సాహంగా కొనసాగింది. తెలంగాణ ఐడీఏ మాజీ అధ్యక్షుడు డాక్టర్ జయసింహ రెడ్డి, జిల్లా కార్యదర్శి వేణుయాదవ్, డాక్టర్ రాంప్రసాద్ రెడ్డి, డాక్టర్ కార్తీక్, డాక్టర్ నరేష్ పాల్గొన్నారు.

ఫార్మసిస్టుల పాత్ర కీలకం

ఎంజీఎం: వైద్యారోగ్య శాఖలో ఫార్మసిస్టుల పాత్ర కీలకమని తెలంగాణ గవర్నమెంట్ ఫార్మసిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బత్తిని సుదర్శన్‌గౌడ్ అన్నారు. డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో ఫార్మసిస్ట్ అసోసియేషన్ సమీక్షా సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగికి, వైద్యుడికి మధ్య ఫార్మసిస్టులు వారధి లాంటి వారని పేర్కొన్నారు. రాష్ట్ర ఉన్నతాధికారులు, వైద్యారోగ్యశాఖ మంత్రిని కలిసి సమస్యలు విన్నవిస్తామని తెలిపారు. ఫార్మసీ ఆఫీసర్ జీఓ వచ్చిన వెంటనే టీజీపీఏ ఆధ్వర్యంలో త్వరలోనే అన్ని జిల్లాల ఫార్మసిస్టులతో హైదరాబాద్‌లో సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు.

దోపిడీదారులకు పాలకుల దాసోహం

న్యూశాయంపేట: దోపిడీదారులకు దాసోహం అయిన పాలకులపై పోరాటాలు చేయాలని భారత జాతీయ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి పిలుపునిచ్చారు. హనుమకొండ బాలసముద్రంలోని సీపీఐ కార్యాలయంలో మంచాల రామాదేవి అధ్యక్షతన జిల్లా సమితి ఆధ్వర్యంలో గురువారం మహిళా సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మతోన్మాదాన్ని పెంచి పోషిస్తున్న శక్తులపై అలుపెరగని పోరాటాలు చేయాలని సూచించారు. సనాతన ధర్మం పేరుతో అనాదిగా మహిళలపై ఆంక్షలు, అత్యాచారాలు పెరిగి పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. సదస్సులో కర్రె భిక్షపతి, దీన, రమ, తిరుమల, లక్ష్మి, పుష్ప, వేముల లక్ష్మి, కొమురమ్మ, రాధ, విజయ లావణ్య, మేరీ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నేదునూరి జ్యోతి

సాంకేతిక నైపుణ్యాలు పెంచుకోవాలి


జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంలో వీసీ, అధ్యాపకులు

కేయూ క్యాంపస్: ఇంజనీరింగ్ విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలను పెంచుకోవాలని కాకతీయ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి సూచించారు. కాకతీయ యూనివర్సిటీలోని కో ఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో పరిపాలన భవనంలోని సెనెట్‌హాల్‌లో రెండు రోజుల వర్క్‌షాప్‌ను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా క్యాడెన్స్ టూల్స్ అనే అంశంపై నిర్వహించిన ప్రారంభ సమావేశంలో వీసీ మాట్లాడారు. ఇంటరాక్టివ్ లెర్నింగ్‌తో వృత్తిపరమైన అభివృద్ధి జరుగుతుందని చెప్పారు. కొత్త ఆలోచనలకు మార్కెట్ ద్వారాలు తెరిచిందన్నారు. తరగతి గది, ప్రయోగశాల కంటే అనుభవజ్ఞులైన వారి శిక్షణలో సలహాలతో పనిచేయడం ద్వారా మరింత నేర్చుకోవచ్చని వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రమణ, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఆసింఇక్బాల్ మాట్లాడారు.

మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి


కాజీపేట రూరల్: వైద్య శిబిరం వద్ద రైల్వే సీఎంఎస్ డాక్టర్ నారాయణ స్వామి, వైద్యులు

హన్మకొండ అర్బన్: మహిళా ఉద్యోగులు తమ ఆరోగ్యంపై కూడా శ్రద్ధ వహించాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి సతీమణి నీలిమారెడ్డి సూచించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా హనుమకొండలోని టీఎన్జీవోస్ భవన్‌లో గురువారం నిర్వహించిన టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్ ఆధ్వర్యంలో మహిళా ఉద్యోగులను సన్మానించారు. జిల్లా కార్యదర్శి బైరి సోమయ్య, మహిళా వింగ్ కన్వీనర్ రాజ్యలక్ష్మి, సహాధ్యక్షుడు పుల్లూరు వేణుగోపాల్, కోశాధికారి రాజేష్ ఉన్నారు.

ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయొద్దు

కాజీపేట రూరల్: నేటి ఉరుకుల పరుగుల జీవన విధానంలో మహిళలు తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయొద్దని దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ డివిజన్ చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ (సీఎంఎస్) డాక్టర్ నారాయణస్వామి అన్నారు. ఉమెన్స్ డేను పురస్కరించుకొని కాజీపేట రైల్వే పాలి క్లినిక్‌లో కాజీపేట పాలి క్లినిక్, రైల్వే ఉమెన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్, ప్రతిమ క్యాన్సర్ ఆస్పత్రి సంయుక్తంగా క్యాన్సర్ వైద్యశిబిరాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణస్వామి మాట్లాడుతూ మహిళలు వివిధ రకాలైన క్యాన్సర్ వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని వివరించారు.

డంపింగ్ యార్డుతో తీవ్ర అనారోగ్యం

- చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేలకు అడ్‌హక్ కమిటీ సభ్యుల వినతి

మడికొండ: మడికొండ – రాంపూర్ గ్రామాల మధ్య ఉన్న డంపింగ్ యార్డుతో పలు గ్రామాల ప్రజలు తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నారని అడ్‌హక్ కమిటీ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈక్రమంలో డంపింగ్ యార్డును అక్కడి నుంచి తొలగించాలని కోరుతూ రాష్ట్ర ఆయిల్ సీడ్స్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి ఆధ్వర్యంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజ్, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరికి గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ డంపింగ్ యార్డుతో మడికొండ, రాంపూర్, అయోధ్యపురం, ఎలుకుర్తి, ధర్మసాగర్, తదితర గ్రామాల ప్రజలు శ్వాసకోశ వ్యాధులతో బాధపడుతున్నారని వాపోయారు. కార్యక్రమంలో అడ్‌హక్ కమిటీ సభ్యులు మాజీ కార్పొరేటర్ తొట్ల రాజుయాదవ్, తాటిరెడ్డి కరుణాకర్‌రెడ్డి, పానగోటి వెంకట్‌రావు, వస్కుల శంకర్, కుమార్ బాబు, పెండ్లి కృష్ణమూర్తి, గాండ్ల భిక్షపతి, దువ్వ నవీన్, రాజారాపు స్వామి, వినోద్, మినుగు సతీష్, తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే శ్రీహరికి వినతిపత్రం అందజేస్తున్న జంగా, అడ్‌హక్ కమిటీ సభ్యులు

'ముస్లింలను విస్మరించిన ప్రభుత్వం'


సమావేశంలో మాట్లాడుతున్న నయీమొద్దీన్

నయీంనగర్: ముస్లింలను కాంగ్రెస్ పార్టీ విస్మరించిందని, ముస్లిం డిక్లరేషన్ ప్రకారం ఈమామ్, మౌజాన్ జీతాలు పెంచకపోవడం బాధాకరమని ఉమ్మడి వరంగల్ జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షుడు ఎండీ.నయీమొద్దీన్ అన్నారు. హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత 4 నెలలుగా గౌరవ వేతనం రాక, పవిత్ర రంజాన్ మాసంలో ఈమామ్, మౌజాన్‌లు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. గత సంవత్సరం నుంచి ఇఫ్తార్ ఏర్పాట్లు, బడ్జెట్ కేటాయింపు, రంజాన్ తోఫా లేవని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ఎండీ.మొహిబుద్దీన్, లాల్ మహమ్మద్, ఇక్బాల్, ఇస్మాయిల్, రషీద్, తస్లీం ఖానం, యాకుబ్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

హసన్‌పర్తి: స్వచ్ఛంద సంస్థలు అందించే సహకారాన్ని సద్వినియోగం చేసుకుని మహిళలు ఆర్థిక స్వావలంబన దిశగా పయనించాలని రోటరీ క్లబ్ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి సూచించారు. హసన్‌పర్తి మండలం మడిపల్లి గ్రామానికి చెందిన 12 మంది నిరుపేద మహిళలకు కుట్టు మిషన్లను రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ కార్యదర్శి ప్రవీణ్‌రావు, కోశాధికారి అంచూరి విజయ్, సర్వస్ పాజెక్టు డైరెక్టర్ గంగోజుల నరేష్, క్లబ్ సభ్యులు బేతి రవీందర్‌రెడ్డి, గోలి రవికుమార్, వంగ రాజిరెడ్డి, నరేష్, నోముల ప్రసాద్, మాదాల సతీష్‌కుమార్ పాల్గొన్నారు.


కుట్టుమిషన్లు పంపిణీ చేస్తున్న క్లబ్ సభ్యులు

నిలిపేసిన ఫలితాలను విడుదల చేయాలి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ప్రైవేట్ డిగ్రీ కళాశాలలకు సంబంధించి డిగ్రీ కోర్సుల మొదటి, మూడో, ఐదో సెమిస్టర్ పరీక్షల ఫలితాలను నిలిపివేయడం సరికాదని పీడీఎస్‌యూ నాయకులు అన్నారు. ఈమేరకు పరిపాలన భవనం ఎదుట గురువారం సాయంత్రం ధర్నా నిర్వహించారు. నిలిపివేసిన ఫలితాలను వెంటనే విడుదల చేయాలని కేయూ వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ కేయూ అధ్యక్షుడు బాలకృష్ణ, ప్రధాన కార్యదర్శి కావ్య, బాధ్యులు గణేష్, చందన, యాదగిరి, సాధన తదితరులు పాల్గొన్నారు.


ధర్నా చేస్తున్న నాయకులు, విద్యార్థులు

సంక్షిప్తంగా

మహిళా సదస్సును విజయవంతం చేయాలి



హన్మకొండ: మహిళా దినోత్సవం సందర్భంగా చైతన్య మహిళా సంఘం ఆధ్వర్యంలో వికారాబాద్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి మహిళా సదస్సును విజయవంతం చేయాలని ఆ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా కన్వీనర్ కళ, కో కన్వీనర్ అనిత పిలుపునిచ్చారు. హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సదస్సు కరపత్రాలను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెరుగైన పరిస్థితులు, 10గంటల పనిదినాన్ని సాధించిన విజయానికి గుర్తుగా మార్చి 8న మహిళా దినోత్సవాన్ని జరుపుకుంటున్నట్లు వివరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రమ, భవాని, సత్య, ఆయా సంఘాల నాయకులు శంకర్, నారాయణ, రాజు, శ్రీనివాసులు, రాజ మహమ్మద్ పాల్గొన్నారు.

అతివలు సంఘటితం కావాలి

నయీంనగర్: ఈనెల 8న జరగనున్న ప్రపంచ మహిళా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని బీసీ మహిళా సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మాదం పద్మజాదేవి కోరారు. మహిళల హక్కుల కోసం అతివలు సంఘటితం కావాలని సూచించారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ వడ్డేపల్లి రోడ్డు కనకదుర్గ కాలనీ వైష్ణవి బాంక్వెట్ హాల్‌లో వేడుకలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా వివిధ రంగాల్లో సేవలందించిన ఉత్తమ మహిళలను సన్మానించనున్నట్లు వివరించారు. సంఘం మహిళా నాయకులు మాడిశెట్టి అరుంధతి, తమ్మల శోభారాణి, ప్రమోద దేవి, హైమ, స్రవంతి, సరస్వతి పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల సంబురాలు

హసన్‌పర్తి: భారతీయ జనతాపార్టీ అభ్యర్థులు రెండు ఎమ్మెల్సీ స్థానాలు కైవసం చేసుకోవడంపై ఆ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు 66వ డివిజన్ పార్టీ కార్యాలయంలో గురువారం సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్, బీజేపీ మండల అధ్యక్షుడు మారం తిరుపతి, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ చకిలం రాజేశ్వర్‌రావు, రైల్వే బోర్డు సభ్యులు దాసరి రాజు, డివిజన్ ప్రధాన కార్యదర్శి మట్టెడ సుమన్, నాయకులు దాడి మధుసూదన్, చంద్రమౌళి, గంట సత్యం, సాయి పాల్గొన్నారు.

ఫార్మసీ విద్యార్థులకు మంచి భవిష్యత్



ఖిలా వరంగల్: ఫార్మసీ విద్యార్థులకు మంచి భవిష్యత్‌ను అందించే లక్ష్యంగా ప్లేస్‌మెంట్ డ్రైవ్ చేపట్టినట్లు తాళ్ల పద్మావతి విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ తాళ్ల వరుణ్, ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశ్వర్‌రావు తెలిపారు. వరంగల్ ఉర్సుగుట్ట తాళ్ల పద్మావతి ఫార్మసీ కళాశాలలో ఫార్మా అన్వేషన్ –2025, మల్టీ కంపెనీ క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్, ఫాదర్ ఆఫ్ ఫార్మసీ ప్రొఫెసర్ ఎంఎల్.ష్రాఫ్ 123వ జయంతిని గురువారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా వారు హాజరై సెల్యూషన్స్, ఒమేగా, హెల్త్‌కేర్, మెడిటెక్ కంపెనీ నిర్వాహకులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్లేస్‌మెంట్ డ్రైవ్ ప్రారంభించారు. కార్యక్రమంలో డాక్టర్లు సురేందర్, పుష్పి, రమ్యకృష్ణ, జ్యోత్స్న, మాధవి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ చేసిన హోంగార్డుకు సన్మానం

వరంగల్ క్రైం: దీర్ఘకాలంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో హోంగార్డుగా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ చేసిన మొహిన్‌ను వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా గురువారం సన్మానించారు. కార్యక్రమంలో అదనపు డీసీపీలు రవి, సురేష్‌కుమార్, ఏసీపీ నాగయ్య, ఆర్ఐ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రుద్రమదేవి విగ్రహం ఏర్పాటు

ఖిలా వరంగల్: చారిత్రక ప్రసిద్ధి చెందిన మెట్ల బావి పునరుద్ధరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. కాకతీయుల నాటి నిర్మాణ శైలి ఉట్టిపడేలా బావి సుందరీకరణ పనులు నిర్వహిస్తున్నారు. ఉన్నతాధికారులు, కాంట్రాక్టర్ ఆదేశాలతో మెట్లబావికి మరింత అందం వచ్చేలా రాణి రుద్రమాదేవి విగ్రహాన్ని హనుమకొండ భీమారం గ్రామానికి చెందిన శిల్పి చెట్లపల్లి రాజమౌళి రూపొందిస్తున్నారు.

రైలునుంచి జారిపడి వ్యక్తి దుర్మరణం

ఖిలా వరంగల్: ఇంటికన్నె – కేసముద్రం రైల్వేస్టేషన్ మధ్య ప్రమాదవశాత్తు రైలునుంచి జారిపడి ఓ వ్యక్తి గురువారం దుర్మరణం చెందాడని జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ రాజు తెలిపారు. 35 – 40 ఏళ్ల మధ్య వయస్సు గల వ్యక్తి వివరాలకు 94415 57232, 87126 58585 నంబర్లలో సంప్రదించాలన్నారు.

గుట్కా విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

మడికొండ: ప్రభుత్వ నిషేధిత గుట్కాలను విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్ పంపినట్లు మడికొండ పోలీసులు తెలిపారు. మడికొండ ఇండస్ట్రీయల్ ప్రాంతంలో రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన పన్నాలాల్ నిర్వహిస్తున్న షాపుపై దాడిచేసి, సుమారు రూ.6,614 విలువగల పొగాకు ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రాజ్‌కుమార్ వివరించారు.

రెండు ఆలయాల్లో చోరీ

ఖిలా వరంగల్: వరంగల్ పెరకవాడలోని చంద్రమౌళేశ్వరి ఆలయం (శివాలయం), కట్టమైసమ్మ ఆలయాల్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. మహాశివరాత్రి సందర్భంగా ఇటీవల ఏర్పాటు చేసిన హుండీలను బుధవారం అర్ధరాత్రి ఎత్తుకెళ్లి అందులోని నగదును అపహరించినట్లు స్థానికులు తెలిపారు. ఫిర్యాదు మేరకు మిల్స్‌కాలనీ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

భూమి దానం ఇచ్చి.. తిరగబడ్డారు

హసన్‌పర్తి: 50ఏళ్ల క్రితం దానం ఇచ్చిన భూమిని పట్టాదారుడు తిరిగి తీసుకునేందుకు యత్నిస్తున్నాడని ఎల్లాపురం గ్రామస్తులు తెలిపారు. ఈమేరకు తగు చర్య తీసుకోవాలని హనుమకొండ ఆర్డీఓ రమేష్ రాథోడ్‌కు గురువారం వినతిపత్రం అందించారు.